క్లుప్తంగా

మణుగూరు మున్సిపల్ కమిషనర్‌గా ప్రసాద్



మణుగూరు టౌన్: మణుగూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా టీ.ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. భువనగిరిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై మణుగూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పినపాక ఎంపీడీఓగా సునీల్ కుమార్



శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

పినపాక: పినపాక ఎంపీడీఓగా సునీల్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంపీడీఓ రామకృష్ణ బదిలీపై ఖమ్మం వెళ్లగా బూర్గంపాడు ఎంపీఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న సునీల్ కుమార్‌ను మండలానికి నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. ఈ మేరకు ఆయనకు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎంపీడీఓకు శుభాకాంక్షలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన బి.నారాయణను గోడ్వాన సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం భద్రాచలం పట్టణాన్ని మూడు ముక్కలు చేయాలని చూసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఇర్ప ప్రకాష్, పూనెం వరప్రసాద్, బన్ని, జగపతి, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడు క్షమాపణ చెప్పాలి

భద్రాచలంటౌన్: ఏజెన్సీ ప్రాంతంలో అన్నదమ్ముల్లా కలిసి ఉంటున్న గిరిజన, గిరిజనేతరుల మధ్య చిచ్చుపెట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన ఏపీ టీడీపీ నాయకుడు అయ్యన్నపాత్రుడు వెంటనే క్షమాపణ చెప్పాలని గిరిజన సంఘం నాయకుడు పూనెం ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ చట్టాలను సవరిస్తేనే టూరిజం అభివృద్ధి చెందుతుందని అనడం అయ్యన్న పాత్రుడి మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. ఏజెన్సీ చట్టాల గురించి మాట్లాడే నాయకులను ఏజెన్సీలో తిరగనీయకుండా అడ్డుకుంటామన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

మణుగూరు టౌన్: మండలంలోని సమితిసింగారం పంచాయతీ వాసవీనగర్‌లో నూతనంగా నిర్మించనున్న వాసవీ అమ్మవారి ఆలయ నిర్మాణానికి శుక్రవారం మణుగూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు దోసపాటి వెంకటేశ్వరరావు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ పనులు వేగంగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ ఆవిష్కరణ



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మణుగూరు రూరల్: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని ఈనెల 8న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి సన్నిధిలో నిర్వహించనున్న విరాట్ విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమం బ్యానర్‌ను మండలంలోని వాసవీనగర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, ఎస్‌కేటీ గ్రూప్స్ చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు, వాసవీ క్లబ్ సభ్యులు, వికాస తరంగిణి, భగవద్రామానుజ సేవా సమితి సభ్యులు దోసపాటి పిచ్చేశ్వరరావు, దుగ్గి సతీష్, కత్తి రాము తదితరులు పాల్గొన్నారు.

అక్కరకు రాని మైదానాలు



మున్సిపాలిటీ పరిధిలోని క్రీడా ప్రాంగణం

అలంకారప్రాయంగా గ్రామీణ క్రీడా మైదానాలు

- పశువులకు ఆవాసాలుగా ప్రాంగణాలు
- పట్టించుకోని అధికారులు

మణుగూరు రూరల్: గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో, పట్టణాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటు నీరుగారిపోయింది. మండలంలోని 14 పంచాయితీ, మున్సిపాలిటీలు ఉండగా గ్రామీణ, పట్టణ క్రీడా ప్రాంగణాల పేరుతో మైదానాలకు స్వాగతం బోర్డులు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. మణుగూరు మున్సిపాలిటీ, సమితి సింగారం, ముత్యాలమ్మనగర్, తదితర గ్రామాల్లో క్రీడామైదానాలు ఏర్పాటు చేయగా అవి అలంకారప్రాయంగా మిగలిపోయాయి. గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల్లో కనీస సౌకర్యాలు కరువై, పరికరాలు లేక పట్టించుకునే పరిస్థితి లేకపోయింది. అట్టహాసంగా ప్రారంభించిన క్రీడా ప్రాంగణాలపై అధికారులు కూడా కన్నెత్తి చూసిన దాఖలాలు కూడా లేవనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పూర్తి స్థాయిలో చేరని సామగ్రి...

క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాంగణాల పేరుతో జూలై 2022లో క్రీడామైదానాలను ప్రారంభించింది. వాలీబాల్, క్రికెట్, ఖోఖో వంటి క్రీడలు ఆడేందుకు కిట్లు, వ్యాయామ పరికరాలను ఏర్పాటుచేసింది. ఆటలు ఆడేందుకు యువతకు ఉపయోగపడే విధంగా అందించిన వాలీబాల్, క్రికెట్ కిట్లు పంచాయతీల్లోనే మూలుగుతున్నట్లు ఆరోపణలున్నాయి. పలు క్రీడా మైదానాలను గ్రామాలకు దగ్గరలోనే... కొన్ని మైదానాలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. ఎవ్వరూ కూడా వీటి వైపు చూడడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

వృథాగా నిధులు..

క్రీడామైదానాల ఏర్పాటుకు అధికారులు ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఏర్పాటు చేశారు. అట్టహాసంగా ప్రారంభించారే తప్ప వాటి పర్యవేక్షణను మరిచారు. దీంతో ప్రభుత్వ సొమ్ము పరులపాలైన చందంగా ప్రాంగణాలకు మంజూరైన లక్షలాది రూపాయల నిధులు వృథా అయ్యాయి. ఏర్పాటు చేసిన క్రీడామైదాన ప్రాంగణాలు యువతకు అక్కరకు రాకపోగా... పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి పశువులకు ఆవాసాలుగా మారుతున్నాయి. క్రీడా ప్రాంగణమంతా చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా కావడం, ఆటస్థలాలు అందుబాటులోకి రాకపోవడంతో గ్రామీణ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి మైదానాలను పునరుద్ధరించి అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న జితేందర్‌కుమార్

ములకలపల్లి: ప్రతీ రైతు తమ వ్యవసాయ క్షేత్రాల్లో విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఐటీసీ ప్లాంటేషన్ ఏరియా మేనేజర్ జితేందర్‌కుమార్ అన్నారు. చింతపేట గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. జామాయిల్ సాగు చేసే రైతులకు ఐటీసీ ఆధ్వర్యంలో లక్ష్మీపురం గ్రామంలోని కార్యాలయంలో ఉచితంగా భూసార పరీక్షలు చేయనున్నట్లు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణరావు, శ్రీధర్, శివ, రైతులు నాగేశ్వరరావు, రామారావు, నాగు, కృష్ణ, రాంబాబు, పెద్దవెంకన్న, వెంకటేశ్వరరావు, రమేశ్, ముత్తయ్య, లేకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళి



చర్ల: నివాళులర్పిస్తున్న నాయకులు



చంద్రుగొండలో..

చంద్రుగొండ : ప్రజాగాయకుడు దివంగత గద్దర్ జయంతి వేడుకలను మాలమహానాడు మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు శంకర్, బాలకృష్ణ, దాసరి రామారావు, రాయి రాజా, నాగబాబు, తలారి నాగరాజు, పిల్లి నాగార్జున, బర్ల ప్రభాకర్, బేతి ప్రేమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

చర్ల: పేద ప్రజల అభ్యున్నతి కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కొట్లాడిన మహనీయుడు యుద్ధనౌక, ప్రజాగాయకుడు గద్దర్ అని ఆయన ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ పాటు పడాలని జాతీయ మాలమహానాడు జిల్లా కన్వీనర్ తోటమళ్ల రమణమూర్తి అన్నారు. గద్దర్ జయంతి సందర్భంగా చర్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ ఏడెళ్ల గణపతి, సీనియర్ నాయకులు తడికల లాలయ్య, కొంగూరు రమణారావు, మోతుకూరి ప్రభాకరావు, కారంపూడి సాల్మన్‌రాజు, తోటమళ్ల వరప్రసాద్, కర్రి సంతోషరావు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

మణుగూరు రూరల్ : మండలంలోని పీవీ కాలనీ భద్రాద్రి స్టేడియంలో మణుగూరు యూత్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎస్‌కె స్కూల్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. టోర్నమెంట్‌లో 12 జట్లు పాల్గొనగా చివరి మ్యాచ్ బాంబేకాలనీ ఎక్స్‌లెంట్ హైస్కూల్, సింగరేణి హైస్కూల్ జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో బాంబేకాలనీ ఎక్స్‌లెంట్ హైస్కూల్ జట్టు విజయాన్ని కైవసం చేసుకోగా సింగరేణి హైస్కూల్ రన్నర్‌గా నిలిచింది. విజేతకు జట్టుకు టీపీసీసీ సభ్యులు చందా సంతోష్‌కుమార్ ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల యాజమాన్యాలు, యూత్ సభ్యులు ముజ్జు, అమూల్ శ్రీను, సాయి, మధు తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందజేస్తున్న సంతోష్‌కుమార్

'వాసవి' ఆధ్వర్యంలో కుంకుమపూజ



మణుగూరు టౌన్: పూజలో పాల్గొన్న మహిళలు



దమ్మపేటలో..

మణుగూరు టౌన్: వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవీనగర్‌లో మణుగూరు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారి సందీప్ పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దోసపాటి లక్ష్మి, వాసవీక్లబ్ అధ్యక్షుడు మిట్టపల్లి శ్యామ్, వనితా వైభవం అధ్యక్షురాలు అంజలి, జోన్ చైర్మన్ దోసపాటి స్వర్ణ, ఐపీసీ బందారు నర్సింహారావు, జిల్లా క్లబ్ పీఆర్‌ఓ కడవెండి విశ్వనాథ గుప్తా, జిల్లా జాయింట్ సెక్రటరీ చిట్టూరి శేషబాబు, సముద్రాల కృష్ణమూర్తి, సాయికుమార్, ఇందుమతి, చిత్తలూరి ఉమ, కత్తి రాము, చిత్తలూరి రమేష్, మణిరత్నం, వందనపు వాసు, వడియాల ప్రభాకర్, కేసా రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట : మండల కేంద్రంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ఉన్న వాసవీ మాత విగ్రహానికి కలశ పూజ, పంచామృత అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మహిళలతో సామూహిక కుంకుమ పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమంను నిర్వహించారు

'ఉపాధి' సిబ్బంది నిరసన



వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

అశ్వాపురం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఏపీఓ, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కేటగిరిల్లో పని చేస్తున్న ఉద్యోగులకు మూడు నెలల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎంపీడీఓ వరప్రసాద్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సీతరామయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జాతరకు సర్వం సిద్ధం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి, కార్యదర్శి బైరెడ్డి సతీష్‌లు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈనెల 3 నుండి 11 వరకు శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జాతర జరుగు 9 రోజులు భక్తులకు నిత్య అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని విజయవంతం చేయాలన్నారు.

ఎలక్షన్ డీటీగా హుస్సేన్



విధుల్లో చేరుతున్న హుస్సేన్

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గ ఎలక్షన్ డీటీగా ఎస్‌డీ.హుస్సేన్ శుక్రవారం విధుల్లో చేరారు. ఖమ్మంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న హుస్సేన్ పదోన్నతిపై అశ్వారావుపేట ఎలక్షన్ డీటీగా చేరారు.

'పేట'లో మొదలైన 'పుర'పాలన



రహదారిపై మట్టి తొలగిస్తున్న కార్మికులు

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో పురపాలక పరిపాలన మొదలైంది. ఈనెల 27 నుంచి అశ్వారావుపేట అధికారికంగా మున్సిపాలిటీ అయినప్పటికీ పరిపాలన ఆలస్యంగా మొదలవుతుందనే ఊహాగానాలకు చెక్ పెడుతున్నారు మున్సిపల్ అధికారులు. పేరుకు ఇన్‌చార్జ్‌లుగా కమిషనర్, టీపీఓ, ఏఈఈ, ఏజేవోలు నియమితులైనా పంచాయతీల నుంచి పూర్తి వివరాలు మున్సిపాలిటీకి అందకున్నా పరిపాలన మాత్రం షురూ చేసేశారు. పంచాయతీల ఖాతాలు పూర్తిగా రద్దయిపోవడంతో అన్ని మున్సిపాలిటీ పరిధిలోకే వచ్చేశాయి. ఇళ్ల నిర్మాణాల అనుమతులు వంటి కీలక పనులు ఆలస్యంగా జరిగినా అత్యవసరంగా నిర్వహించాల్సిన పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా పనులు మున్సిపాలిటీల విధానంలో జరుగుతున్నాయి.

చెత్త తొలగింపు..

జాతీయ రహదారిపై ఏళ్లుగా పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పలకు మున్సిపాలిటీ పాలనతో మోక్షం లభించినట్లయింది. ఈ మేరకు శుక్రవారం జాతీయ రహదారిపై పేరుకుపోయిన మట్టి కుప్పలను మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు తొలగిస్తున్నారు. ఇదే కాకుండా గతంలో కంటే పారిశుద్ధ్య సేవలు మరింత మెరుగుకానున్నాయి. తెల్లవారుజామునే జాతీయ రహదారిపై చెత్తను తొలగించి నిత్యం పరిశుభ్రంగా ఊడ్చాల్సి ఉంది. చెత్త సేకరణ వాహనాల ద్వారా 22 వార్డులలోని అన్ని వీధుల్లో చెత్తను సేకరించాల్సి ఉంది. చెత్త సేకరణతో ఒక అడుగు ముందుకు వేశారు. దశలవారీగా అన్ని సేవలు పట్టణ వాసులకు అందుబాటులోకి రానున్నాయి. కాకుంటే పన్నుల భారం మోయక తప్పదు.

ఎంపీటీసీ స్థానాలు కుదింపు



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్

అశ్వారావుపేట: అశ్వారావుపేటకు ప్రభుత్వం మున్సిపాలిటీ హోదాను కల్పించడంతో మండలంలోని ఎంపీటీసీ స్థానాల సంఖ్యను కుదించినట్లు ఎంపీడీఓ ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు పంచాయతీలను కలుపుతూ అశ్వారావుపేట మున్సిపాలిటీ ఏర్పాటు కావడంతో మున్సిపాలిటీ పరిధిలోని ఆరు ఎంపీటీసీ స్థానాలు రద్దు కావడంతో మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలు మాత్రమే ఉంటాయన్నారు. పాత అల్లిగూడెం ఊట్లపల్లిలో, వేదాంతపురంను వినాయకపురంలో కలుపుతున్నట్లు తెలిపారు. దీనిపై అభ్యంతరాలను లిఖితపూర్వకంగా తెలపాలని సూచించారు. ఈ సమావేశంలో తుమ్మ రాంబాబు, చిరంజీవి, రామకృష్ణ, కట్రం స్వామిదొర, బండారు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మణుగూరురూరల్: మాట్లాడుతున్న వెంకటపుల్లయ్య



భద్రాచలంటౌన్: బహుమతులు అందజేస్తున్న ఎస్సై మధు ప్రసాద్, ఉపాధ్యాయులు

మణుగూరు రూరల్: ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమ నిబంధనలను తప్పక పాటించాలని మణుగూరు డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి, భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటపుల్లయ్య సూచించారు. 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మణుగూరు ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చడం ప్రతీ డ్రైవర్ బాధ్యత అన్నారు. బస్సులను నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అతివేగంగా బస్సులను నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారు హెల్మెట్ ధరిస్తూ వాహనాలను నడపాలన్నారు. అనంతరం వారు డ్రైవర్లందరికీ రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, డిపో మేనేజర్ శ్యాంసుందర్, సీఐ కనకదుర్గ, గ్యారేజ్ ఇన్‌చార్జ్ విజయరాజ్, పీవీ రెడ్డి(ఎస్‌డీఐ) డిపో సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై పోటీ పరీక్ష

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని నన్నపనేని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పోటీ పరీక్ష నిర్వహించారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ పోటీ పరీక్షలో మొత్తం 60 మంది విద్యార్థులు పాల్గొనగా ముగ్గురికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మధుప్రసాద్ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న నాగేశ్వరరావు

ములకలపల్లి: ఇటీవల మృతిచెందిన రెవెన్యూ ఉద్యోగి పాలకుర్తి లక్ష్మయ్య కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. గురువారం పొగళ్లపల్లిలో లక్ష్మయ్య స్వగృహానికి వెళ్ళి, ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, పూరేటి నర్సింహారావు, పొక్కిలి రాజు, తానం కృష్ణ, గూడపాటి సురేశ్; ఏసుపాక వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి శ్రీను ఉన్నారు.

ఆటో యూనియన్ ఎన్నిక

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఏరియా ఆటో యూనియన్ ఎన్నిక శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడిగా నగేష్, కార్యదర్శిగా రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా శ్రీను, కోశాధికారిగా మంగరావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించడంతో పాటు అడ్డ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

విద్యార్థులకు వితరణ




విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఫౌండేషన్ సభ్యులు

అశ్వాపురం: భారజల కర్మాగారం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున 24 మందికి శుక్రవారం ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. ప్రిన్సిపాల్ శేషుబాబు, ఫౌండేషన్ సభ్యులు సోమయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు మూసుకుపోతోంది..

- ఇరువైపులా చెట్లతో కనిపించని రహదారి
- వాహనాలు కనపడక ప్రమాదాలు

చర్ల: తాలిపేరు ప్రాజెక్టు నుంచి పూసుగుప్ప వరకు నిర్మించిన బీటీ రోడ్డు మూసుకుపోతోంది. ఏళ్ల తరబడి ఈ రోడ్డుకు ఇరువైపులా పనులు చేపట్టకపోవడంతో రోడ్డు పక్కన మొలిచిన చెట్లు రోడ్డుపైకి చేరుకుంటున్నాయి. పలు చోట్ల ఉన్న మలుపుల్లో కూడా చెట్లు రోడ్ల మీదగా రాగా ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు కనిపించకపోతుండడంతో వాహనాలు ఎదురెదురుగా ఢీ కొంటున్నాయి. ఎక్కువగా ద్విచక్రవాహనాల ప్రమాదాలు జరుగుతుండగా వాహనదారులు తీవ్రంగా గాయాలపాలవుతున్నారు. ప్రధానంగా గోరుకొండ నుంచి సీఆర్‌పీఎఫ్ క్యాంపు మీదుగా చెన్నాపురం వరకు ఉన్న రహదారి పొడవునా ఇదే పరిస్థితి నెలకొంది. రోడ్లు భవనాల శాఖ ఆధీనంలో ఉన్న ఈ రోడ్డును శాఖ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదన్న విమర్శలున్నాయి. ఈ రోడ్డు మార్గంలో వివిధ రకాల చెట్లతో ముళ్ల చెట్లు కూడా ఉండడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పుకునే సందర్భంలో ముళ్ల చెట్లల్లో కూడా వాహనదారులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఈ రహదారిపై దృష్టి సారించి చెట్లను తొలగించి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.



రహదారిపైకి పెరిగిన చెట్లు

